నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 14 మార్చి 2024 | KHAMMAM

రాష్ట్రస్థాయి టోర్నీలో కేటీపీఎస్ జట్టు సత్తా

క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ వెంకటేశ్వరరావు

పాల్వంచ, మార్చి 13 : భూపాలపల్లిలోని కేటీపీపీ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ టోర్నమెంట్ అండ్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కేటీపీఎస్ ఏడో దశ జట్టు ఘన విజయం సాధించింది. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కేటీపీఎస్ ఏడో దశ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ప్రథమ, డబుల్స్‌లో ప్రథమ, టీమ్ ఈవెంట్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. క్రికెట్‌లో రెండో స్థానంలో నిలిచారు. కాగా.. వీరిని కేటీపీఎస్ ఏడో దశ సీఈ వెంకటేశ్వరరావు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎస్ ఈలు యుగపతి, డీఈ ఎస్ఎన్ఎస్ శేఖర్, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు ఇందిరమ్మ ఇళ్లు

చేగొమ్మలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజా సమస్యలపై అధికారులు స్పందించాలి
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, మార్చి 13 : రాష్ట్రంలోని ప్రతి పేదింటి ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నాయకన్‌గూడెం, గట్టుసింగారం, చేగొమ్మ, చౌటపల్లి గ్రామాల్లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని, తన పర్యటన సమయంలో ఆయా దరఖాస్తులను వెంటనే పరిశీలించి వాటిపై నిజానిజాలు తేల్చాలన్నారు. అనంతరం గట్టుసింగారం మాజీ సర్పంచ్ రమణను పరామర్శించారు. చేగొమ్మ, నాయకన్‌గూడెం, గట్టుసింగారం గ్రామాల్లో భూ ఫిర్యాదులను స్వీకరించిన మంత్రి ఆర్డీవో నరేశ్‌కు వాటిని అందజేశారు. విద్యుత్ సమస్యలను ఏడీఈ కోక్యా నాయక్‌కు, పంచాయతీరాజ్‌కు సంబంధించిన సమస్యలను ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డికి ఇచ్చి వాటిపై గ్రామాల్లోకి వెళ్లి విచారణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, సుడిగాలి కిషన్ రావు, ఏసీపీ తిరుపతిరెడ్డి, స్థానిక నాయకులు జూకూరి గోపాల్‌రావు, బజ్జూరి వెంకటరెడ్డి, ఎడవల్లి రాంరెడ్డి, హఫీజుద్దీన్, మంకెన వాసు, సూర్యనారాయణరెడ్డి, కొండపర్తి సురేశ్, లింగారెడ్డి, వైస్ ఎంపీపీ కంచర్ల పద్మారెడ్డి, వినోద, తహసీల్దార్ సురేశ్‌కుమార్, డీఈ వేణుగోపాల్, రమేశ్‌రెడ్డి, ఏవో వాణి తదితరులు పాల్గొన్నారు.

బోనకల్లు మండలం రావినూతల గ్రామంలో నాడు నీటితో కళకళలాడుతున్న చెరువు

బోనకల్లు మండలం రావినూతల గ్రామంలో నేడు ఎండిపోయి నెర్రెలు బారిన చెరువు

నాడు జలకళ.. నేడు వెలవెల

- మార్చి నెలలోనే అడుగంటిన చెరువులు
- పశువులు తాగేందుకూ నీళ్లు లేక ఇబ్బందులు

గడిచిన పదేళ్లుగా మండు వేసవిలోనూ నిండుగా తొణికిసలాడిన తటాకాలు.. ఈ ఏడాది మార్చిలోనే ఎండిపోయాయి. నాడు జలకళను సంతరించుకున్న చెరువులన్నీ నేడు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇటీవల స్పష్టం చేసిన విధంగా ఇదంతా కాలం తెచ్చిన కరువు కాకుండా.. కాంగ్రెస్ తెచ్చిన కరువులా కనిపిస్తుందనడంలో సందేహం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం జలాశయాలను నీటితో నింపుతూ వస్తే.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అదే జలాశయాలను ఖాళీ చేస్తూ వస్తోంది. మరీ ముఖ్యంగా గత కేసీఆర్ ప్రభుత్వం నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా దాని ఆయకట్టు కింద జలవనరులన్నింటినీ నింపింది. కానీ.. ఇటీవల వచ్చిన కాంగ్రెస్ ఏపీతో దోస్తీ చేసి నాగార్జున సాగర్ ప్రాజెక్టును కృష్ణా జలాల నదీ యాజమాన్య బోర్డుకు అప్పగించింది. దీంతో గడిచిన పదేళ్లుగా సాగర్ జలాలతో నిండుతున్న ఆయకట్టు చెరువులన్నీ ఈ ఏడాది ఎండిపోతున్నాయి. మధిర నియోజకవర్గంలోని బోనకల్లు, మధిర, ఎర్రుపాలెం, ముదిగొండ, చింతకాని మండలాల్లో 122 చెరువులు ఉన్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా సుమారు రూ.20 కోట్లు వెచ్చించి వీటన్నింటికీ మరమ్మతులు చేయించింది. ఫలితంగా నీటి నిల్వలు, భూగర్భ జలాలు పెరిగాయి. అటు వర్షాలతోపాటు ఇటు సాగర్ జలాలూ అందేవి. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఆ చెరువులన్నీ అడుగంటాయి. కనీసం పశువులు తాగేందుకు కూడా నీళ్లు లేవు. ఇక యాసంగి పంటలు, తాగునీటి నిల్వల సంగతి సరేసరి. స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం అయినప్పటికీ చొరవ తీసుకొని చెరువులు నింపే పరిస్థితి లేదు. బోనకల్లు మండలం రావినూతల గ్రామంలోని ఈ చెరువే ఇందుకు నిదర్శనం.

–మధిర, మార్చి 13

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించాలని తలనీలాల సమర్పణ

–తిరుమల శ్రీవారి సన్నిధిలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

శ్రీవారి సేవలో వద్దిరాజు దంపతులు

ఖమ్మం, మార్చి 13: తెలంగాణ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తిరుమలేశుని సన్నిధిలో తలనీలాలు సమర్పించారు. బుధవారం తెల్లవారుజామున ఆయన సతీమణి విజయలక్ష్మితో కలిసి అలిపిరి నుంచి కాలినడకన బయల్దేరి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతున్ని ప్రార్థించానని తెలిపారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

డీఆర్‌డీవో విద్యాచందన

నర్సరీల్లో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో విద్యాచందన

టేకులపల్లి, మార్చి 13 : ప్రస్తుత వేసవిలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరందించాలని డీఆర్‌డీవో విద్యాచందన అన్నారు. ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు, సులానగర్, గొల్లపల్లి గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను బుధవారం పరిశీలించిన ఆమె నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మొలకలు రాని బ్యాగ్‌లలో మళ్లీ గింజలు నాటాలన్నారు. ఎదుగుతున్న మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆమె రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పిల్లలతో ముచ్చటించారు. తర్వాత ఉపాధ్యాయులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో రవీంద్రరావు, ఏపీవో కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, పవిత్ర, ఉమామహేశ్, టీఏ ధనలక్ష్మి, భీముడు, ఎఫ్ఏ లకాన్, బాలాజీ తదితరులు ఉన్నారు.

క్వార్టర్లను వినియోగంలోకి తేవాలి

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

సిబ్బంది క్వార్టర్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, మార్చి 13 : ఐటీడీఏ ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణ పనులను పూర్తి చేసి.. అందుబాటులోకి తేవాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ ప్రాంగణంలోని క్వార్టర్స్ నిర్మాణాలను పరిశీలించిన ఆయన పనుల వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భారీ వ్యయంతో నిర్మించిన క్వార్టర్లను అసంపూర్తిగా వదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయని, ఎందుకూ పని రాకుండా పోతున్నాయన్నారు. వెంటనే వాటి మరమ్మతు పనులు పూర్తి చేసి.. సిబ్బందికి కేటాయించేలా చూడాలన్నారు. పిల్లలు ఆడుకునేందుకు గతంలో నిర్మించిన పార్కులో సౌకర్యాలను మెరుగుపరిచి.. ఆధునిక పరికరాలు సమకూర్చి అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీటీఆర్వోఎఫ్ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులతో అక్షరం దిద్దించేలా.. ..న్యూఇండియా లిటరసీ ప్రోగ్రాం అమలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా బడ్జెట్
- బీఈడీ విద్యార్థులే వలంటీర్లు
- జిల్లాల వారీగా ఇన్‌చార్జుల పర్యవేక్షణ
- సెక్రటరీగా డీఈవో, చైర్మన్‌గా కలెక్టర్.. త్వరలో ప్రోగ్రాం మొదలు

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 13: 'అందరూ చదవాలి.. అందరూ రాయాలి..' అనే నినాదంతో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వయోజన విద్యాశాఖ న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్ఐఎల్‌పీ) అనే సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందుకు అవసరమయ్యే బడ్జెట్‌లో కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం భరిస్తాయి. పథకంలో వలంటీర్లుగా బీఈడీ చదువుతున్న విద్యార్థులు వ్యవహరిస్తారు.

ఇన్‌చార్జుల నియామకం...

పథకాన్ని పర్యవేక్షించేందుకు ఇప్పటికే వయోజన విద్యా శాఖ జిల్లాల వారీగా ఇన్‌చార్జులను నియమించింది. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాకు డీడీ వర్మ, భద్రాద్రి జిల్లాకు అనిల్‌ను ఎంపిక చేసింది. వీరు బీఈడీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను వలంటీర్లుగా ఎంపిక చేస్తారు. ఒక్కో వలంటీర్ పదిమంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పథకం అమలుకు ప్రత్యేకంగా 'ఉల్లాస్' అనే యాప్ అందుబాటులోకి వచ్చింది. యాప్‌లో వలంటీర్లు, నిరక్షరాస్యులు, పాఠశాలల వివరాలు అందుబాటులో ఉంటాయి.

కొత్త అకౌంట్స్ ఓపెన్..

పథకం అమలుకు ఇప్పటికే అధికారులు జిల్లాల వారీగా కొత్త బ్యాంక్ ఖాతాలు తెరిచారు. ఆ ఖాతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులు జమ అవుతాయి. పథకానికి మెంబర్ సెక్రటరీగా డీఈవో, చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. అధికారులు ఇప్పటికే ఖమ్మం జిల్లావ్యాప్తంగా 1,77,392 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించారు. వీరిలో 33,693 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలాగే భద్రాద్రి జిల్లావ్యాప్తంగా 1,55,890 మంది నిరక్షరాస్యులు ఉండగా, వీరిలో 2,5518 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. పథకం అమలుపై ఈ నెలాఖరులో కలెక్టర్ల అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయని భద్రాద్రి జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ అనిల్ తెలిపారు.



వలంటీర్, లెర్నర్ వివరాలు నమోదు చేసే ఉల్లాస్ యాప్

పది రోజులుగా నీళ్లివ్వకుంటే ఎలా?

ఖాళీ బిందెలతో ఖమ్మం 25వ డివిజన్ మహిళల నిరసన

గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని స్పష్టీకరణ

ఖమ్మం 25వ డివిజన్‌లో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఖమ్మం, మార్చి 13: గడిచిన పది రోజులుగా తాగునీరు ఇవ్వకుంటే ఎలా అని ఖమ్మం 25వ డివిజన్ మహిళలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని గుర్తుచేశారు. నల్లాల ద్వారా తాగునీళ్లు అందించాలని ప్రభుత్వానికి, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో పది రోజులుగా మున్సిపల్ నీటి సరఫరా నిలిచిపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ మేరకు స్థానిక మహిళలు 25వ డివిజన్ గాంధీపార్క్ ప్రాంతం వద్ద బుధవారం ఉదయం ఖాళీ బిందెలతో రోడ్డు మీదకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి రాలేదని అన్నారు. తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

చేపల పెంపకంతో ఉపాధి : డీఏవో విజయనిర్మల

శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

ఖమ్మం వ్యవసాయం, మార్చి 13 : చేపల పెంపకంతో తాము ఉపాధి పొందడంతోపాటు పలువురికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల అన్నారు. నగరంలోని రైతు శిక్షణ కేంద్రంలో బుధవారం 'చేపపిల్లల పెంపకం–యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై జరిగిన శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేపలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో యువత చేప పిల్లలను అభివృద్ధి చేసి వాటి విక్రయం ద్వారా ఉపాధి పొందవచ్చన్నారు. చేపలతోపాటు రొయ్యలు, ఆక్వేరియంలో పెంచే అలంకరణ చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. గ్రామీణ యువతకు చేపల పెంపకంపై ఆరు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రవికుమార్ చేపల పెంపకంపై మత్స్య రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. వారి సమస్యను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, డి.రామకృష్ణ, శరత్, రాజేశ్, టి.అరుణజ్యోతితోపాటు ఆయా మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, మార్చి 13 : జిల్లా కేంద్రంతోపాటు చుట్టూ ఉన్న గ్రామీణ ప్రాంతాలను ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని, దశలవారీగా నిధులు మంజూరు చేయించుకొని పనులు చేపడుతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో రూ.4.95 కోట్ల డీఎంఎఫ్, 14వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బస్సు షెల్టర్, పార్కు, టెన్నిస్ కోర్టు, కల్వర్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిపోయిన అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. వేసవిలో పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, పుల్లయ్య, శేషాంజన్‌స్వామి, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, కంచర్ల జమలయ్య, అనిల్, సలిగంటి శ్రీనివాస్, ఫహీం, జహీర్, అజీజ్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.